
# పెన్ పవర్
తెలంగాణ రౌండప్
బుధవారం 16 ఏప్రిల్ 2025 పేజీలు 8


# నల్లాలకు మోటార్లు బిగిస్తే జరిమానా



**హైదరాబాద్ పెన్ పవర్:** నిబంధనలకు విరుద్ధంగా నల్లాలకు మోటార్లు బిగించిన వారిపై జలమండలి కొరడా ఝులిపించింది. నల్లాలకు అక్రమంగా మోటార్లు బిగించిన 84 మందికి జరిమానాలు విధించింది. కాగా, మోటార్ ఫ్రీ ట్యాప్ డ్రైవ్‌ను వాటర్ బోర్డు ప్రారంభించింది. డ్రైవ్‌లో భాగంగా మంగళవారం (ఏప్రిల్ 15) మాదాపూర్?లో వాటర్ బోర్డు ఎండీ అశోక్ రెడ్డి తనిఖీలు నిర్వహించారు. పలువురు

-2 లో




- వెబ్‌సైట్, మొబైల్ యాప్, పోస్టర్‌ను ఆవిష్కరించిన కొండా సురేఖ, శ్రీధర్ బాబు
- నిత్యం 50 వేల నుంచి లక్ష మంది భక్తులు వస్తారని అంచనా
- పుష్కరాల కోసం ప్రభుత్వం రూ. 35 కోట్లు కేటాయించిందన్న మంత్రులు

# మే 15 నుంచి 26 వరకు సరస్వతీ పుష్కరాలు...

## వెబ్‌సైట్‌ను ఆవిష్కరించిన మంత్రులు

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణ రాష్ట్రంలోని భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో మే 15వ తేదీ నుంచి 26 వరకు సరస్వతీ నది పుష్కరాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వెబ్‌సైట్, మొబైల్ యాప్, పోస్టర్‌లను మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్ బాబు ఆవిష్కరించారు. పుష్కరాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను ఈ ఇద్దరు మంత్రులు పర్యవేక్షిస్తున్నారు. పుష్కరాల సమయంలో భక్తులు ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రులు తెలిపారు.
పన్నెండు రోజుల పాటు జరగనున్న ఈ పుష్కరాలకు నిత్యం 50 వేల నుంచి లక్ష మంది

-2 లో

# క్రమబద్ధీకరణ విధానంతో అక్రమ నిర్మాణాలకు ప్రోత్సాహం

- హైకోర్టు వ్యాఖ్య
- మణికొండ జాగీరు నిర్మాణాలపై ఏం చర్యలు తీసుకున్నారో నివేదిక సమర్పించాలని జీహెచ్ఎంసీకి ఆదేశం
- లేదంటే జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కమిషనర్లు వ్యక్తిగతంగా హాజరు కావాల్సి ఉంటుందని స్పష్టీకరణ





**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్, సికింద్రాబాద్ జంట నగరాల్లో అనుమతులు లేని, అనుమతులను ఉల్లంఘించి చేపట్టిన నిర్మాణాలపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉండగా.. ప్రభుత్వం, జీహెచ్ఎంసీలు అమలు చేస్తున్న క్రమబద్ధీకరణ విధానం అక్రమ నిర్మాణాలకు ప్రోత్సాహం ఇస్తున్నట్లుందని హైకోర్టు మంగళవారం వ్యాఖ్యానించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం మణికొండ జాగీరులోని

-2 లో

# హైదరాబాద్‌లో ఈదురు గాలులతో వడగండ్ల వాన

- బేగంబజార్, కోఠి, బషీర్‌బాగ్, నాంపల్లి, అమీర్‌పేట తదితర ప్రాంతాల్లో వర్షం
- పలు ప్రాంతాల్లో జలమయమైన రహదారులు
- రోడ్ల మీద నీరు నిలవడంతో వాహనదారుల ఇబ్బందులు



**హైదరాబాద్ పెన్ పవర్:**హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. ఉపరితల ఆవర్తన ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. మధ్యాహ్నం హైదరాబాద్‌లోని బేగంబజార్, కోఠి, బషీర్‌బాగ్, నాంపల్లి, లక్డీకాపూల్, ట్యాంక్‌బండ్, అమీర్‌పేట, ఖైరతాబాద్, ప్యాట్నీ, మారేడుపల్లి ప్రాంతాల్లో రోడ్లన్నీ జలమయమ య్యాయి.

-2 లో

# నోవాటెల్ లో సీఎం రేవంత్ రెడ్డికి తప్పిన ప్రమాదం

- నోవాటెల్‌లో సీఎం ఎక్కిన లిఫ్ట్ లో స్వల్ప అంతరాయం
- 8 మంది ఎక్కాల్సిన లిఫ్ట్ లో 13 మంది ఎక్కడంతో మొరాయింపు
- ఓవర్ వెయిట్ వల్ల ఉండాల్సిన ఎత్తుకంటే కిందికి దిగిన లిఫ్ట్
- అప్రమత్తమై లిఫ్టులో నుంచి సీఎంను సురక్షితంగా బయటకు తీసుకువచ్చిన అధికారులు



**హైదరాబాద్ పెన్ పవర్:**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రమాదం తప్పింది. హైదరాబాద్ నోవాటెల్‌లో సీఎం ఎక్కిన లిఫ్ట్ లో స్వల్ప అంతరాయం ఏర్పడింది. ఎనిమిది మంది ఎక్కాల్సిన లిఫ్ట్ లో 13 మంది ఎక్కడంతో మొరాయించింది. ఓవర్ వెయిట్ కారణంగా ఉండాల్సిన ఎత్తుకంటే లిఫ్ట్ కిందికి దిగింది. దీంతో అధికారులు ఆందోళనకు గురయ్యారు. అటు హోటల్ సిబ్బంది, అధికారులు అప్రమత్తమయ్యారు. వెంటనే లిఫ్ట్ ఓపెన్ చేసి సీఎం రేవంత్‌ను సురక్షితంగా బయటకు తీసుకువచ్చారు. అనంతరం సీఎంను అధికారులు వేరే లిఫ్ట్ లో పంపారు. త్రుటిలో ముఖ్యమంత్రికి ప్రమాదం తప్పడంతో అక్కడ ఉన్న నేతలు, అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# క్రమబద్ధీకరణ విధానంతో అక్రమ నిర్మాణాలకు ప్రోత్సాహం

- మొదటి పేజి తరువాయి

సర్వే నం.203/1/3/1, 204 నుంచి 209, 210/1/3లలో అక్రమ నిర్మాణాలు చేపట్టినా చర్యలు తీసుకోకపోవడాన్ని సవాలు చేస్తూ మణినగర్ ప్లాట్ మెంబర్స్ ప్రొటెక్షన్ వెల్ఫేర్ సొసైటీ, ఎస్.గోపాల్‌లు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారించిన హైకోర్టు.. మణికొండ జాగీరులో యథాతథ స్థితి కొనసాగించాలని, నిర్మాణాలకు సంబంధించిన ఫొటోలను సమర్పించాలంటూ 2023 మార్చి 14న మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులకు విరుద్ధంగా అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని, అయినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదంటూ ఎస్.గోపాల్.. కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సి.వి.భాస్కర్‌రెడ్డి మంగళవారం మరోసారి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది వి.ఎస్.ఆర్.ఆంజనేయులు వాదనలు వినిపిస్తూ.. కోర్టు ఉత్తర్వులున్నప్పటికీ పలు అక్రమ నిర్మాణాలు వెలిశాయన్నారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడంలో జీహెచ్‌ఎంసీ విఫలమైం దన్నారు. అధికారులతో కుమ్మక్కైన నిర్మాణదారులు అనుమతుల కు మించి నిర్మాణాలు చేపట్టారన్నారు. జీహెచ్‌ఎంసీ తరఫు న్యాయవాది జి.మధుసూదన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ అక్రమ నిర్మాణాలను సీజ్ చేశామని, చట్టప్రకారం నిర్మాణాలను నిలిపివేయడానికి చర్యలు చేపట్టామని తెలిపారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి.. పిటిషన్‌తోపాటు కోర్టు ధిక్కరణ పిటిషన్‌తో జతచేసిన ఫొటోలను పరిశీలిస్తే అక్రమ, అనధికారిక నిర్మాణాలను ఇప్పటికే మొదలుపెట్టినట్లు స్పష్టమవుతోందన్నారు. ప్రాథమికంగా చూస్తే.. యథాతథ స్థితి కొనసాగించాలంటూ 2023 మార్చి 14న ఇదే హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను చిత్తశుద్ధితో అమలు చేయలేదని తెలుస్తోందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు, తొలగించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు పలు తీర్పులు వెలువరించిందన్నారు. మణికొండ జాగీరులో మొత్తం ఎన్ని నిర్మాణాలున్నాయి, ఎన్నింటికి అనుమతులు ఇచ్చారు, అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాల వివరాలు ఇవ్వాలని జీహెచ్‌ఎంసీని ఆదేశించారు. అనుమతులను ఉల్లంఘించి చేపట్టిన, అక్రమ నిర్మాణాలపై ఇప్పటివరకు చేపట్టిన చర్యలుబీ వాటికి విద్యుత్, నీటి సరఫరా నిలిపివేయాలంటూ ఏవైనా లేఖలు రాశారా.. ఒకవేళ రాస్తే వాటి వివరాలుబీ అక్రమ నిర్మాణాలపై ఉదాసీనంగా వ్యవహరించిన అధికారులపై తీసుకున్న చర్యలపై జులై 2లోగా నివేదిక సమర్పించాలన్నారు. ఒకవేళ నివేదిక సమర్పించడంలో విఫలమైతే జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ కమిషనర్‌లు వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవాల్సి ఉంటుందని పేర్కొంటూ విచారణను జులై 2కు వాయిదా వేశారు.

## మే 15 నుంచి 26 వరకు సరస్వతీ పుష్కరాలు...

- మొదటి పేజి తరువాయి

భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా భక్తులు వస్తారని తెలిపారు. కాళేశ్వరంలో 17 అడుగుల ఏకశిల రాతి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. భక్తుల సౌకర్యం కోసం ఆలయ పరిసరాల్లో టెంట్ సిటీని నిర్మిస్తున్నట్లు తెలిపారు. పుష్కరాల నిర్వహణ కోసం ప్రభుత్వం రూ. 35 కోట్లు కేటాయించిందని అన్నారు.

## హైదరాబాద్‌లో ఈదురు గాలులతో వడగండ్ల వాన

- మొదటి పేజి తరువాయి

రోడ్లపై నీరు నిలవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో చాలా చోట్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రాగల మూడు రోజుల్లో తెలంగాణలో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీల వరకు పెరిగే అవకాశం ఉందని తెలిపింది.

## నల్లాలకు మోటార్లు బిగిస్తే జరిమానా

- మొదటి పేజి తరువాయి

నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించారు. నగరవ్యాప్తంగా 64 ఇల్లీగల్ మోటార్లు స్వాధీనం చేసుకుని.. 84 మందికి పెనాల్టీ విధించారు జలమండలి అధికారులు. ఈ సందర్భంగా ఎండీ అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. 150 కిలో మీటర్ల నుంచి పెద్ద పంపులు, భారీ పైపుల ద్వారా నగర పౌరులకు జలమండలి నీటి సరఫరా చేస్తోందని తెలిపారు. వాటర్ బోర్డు అందిస్తున్న తాగునీటిని నీటిని మొక్కలకు, ఫ్లోర్, వాహనాలను కడగడానికి వినియోగించకూడదని హెచ్చరించారు.

నల్లాలకు మోటార్లు బిగించి నీటిని తోడితే మిగితా వినియోగదారులు నీళ్లు రాక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. నిబంధనలను అతిక్రమించి ఎవరైనా నల్లాలకు మోటార్లు బిగిస్తే 155313కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. నల్లాలకు మోటార్లు బిగిస్తే మోటార్లు స్వాధీనం చేసుకోవడంతో పాటు భారీ జరినామాలు విధిస్తామని హెచ్చరించారు.

## సామాన్యులకు గుడ్‌న్యూస్.. భారీగా తగ్గిన ధరలు..

**హైదరాబాద్ పెన్ పవర్:** అనేక త్రైమాసికాలుగా అధిక ద్రవ్యోల్బణంతో ఇబ్బందులు ఎదుర్కొన్న భారతీయ ప్రజలకు శుభవార్త వచ్చింది. మార్చి నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం ఏకంగా 67 నెలల కనిష్ఠానికి పడిపోయిందని తాజా గణాంకాలు వెల్లడించాయి. దీంతో రిటైల్ ద్రవ్యోల్బణం గత నెలలో నమోదైన 3.61 శాతం నుంచి ప్రస్తుతం 3.34 శాతానికి దిగి వచ్చింది. వాస్తవానికి ఆర్బీఐ ద్రవ్యోల్బం టార్గెట్ 4 శాతం కంటే కిందికి రిటైల్ ద్రవ్యోల్బణం చేరుకోవటం ఇది వరుసగా రెండో నెల కావటం గమనార్హం. ఇటీవల రిజర్వు బ్యాంక్ గవర్నర్ వడ్డీ రేట్ల తగ్గింపును ప్రకటిస్తూ కూడా ఆహార ద్రవ్యోల్బణం తగ్గిందని, పరిస్థితులు పూర్తిగా అనుకూలంగా ఉన్నాయని అందుకే రేట్ల తగ్గింపులకు తాము నిర్ణయించినట్లు ప్రకటించారు. ఇదే క్రమంలో దేశంలో ఆహార ద్రవ్యోల్బణం మార్చి నెలలో 2.96 శాతానికి పడిపోయింది. వాస్తవానికి ఇది ఫిబ్రవరి నెలలో 3.75 శాతంగా నమోదైన సంగతి తెలిసిందే.






మ్నొత్తానికి 2025 ఆర్థిక సంవత్సరం ద్రవ్యోల్బణం 4.6 శాతం వద్ద ముగింపును నమోదు చేసింది. అయితే రానున్న కాలంలో ఇది 4 శాతం కంటే కిందికి పడిపోతుందని రిజర్వు బ్యాంక్ అంచనా వేస్తోంది.

అలాగే మ్నొదటి త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 3.6 శాతానికి దిగివస్తుందని సెంట్రల్ బ్యాంక్ పేర్కొంది. ఇదే క్రమంలో రెండవ త్రైమాసికంలో ద్రవ్యోల్బణం 3.9 శాతానికి చేరుకుంటుందని పేర్కొంది. అయితే ఈ పరిస్థితులు ఇలాగే కొనసాగితే రిజర్వు బ్యాంక్ కీలక వడ్డీ రేట్లను వేగంగా తగ్గించటానికి, దూకుడుగా వడ్డీ రేట్ల కోతలకు వెళ్లేందుకు దోహదపడుతుందని నిపుణులు చెబుతున్నారు.

## సికింద్రాబాద్‌లో దారుణం.. పురుగుల మందు తాగి అక్కాచెల్లెలు ఆత్మహత్య



**హైదరాబాద్ పెన్ పవర్:** సికింద్రాబాద్ పరిధిలోని ఖారా?నాలో దారుణ ఘటన వెలుగు చూసింది. ఇంట్లో పురుగుల మందు తాగి అక్కాచెల్లెలు ఆత్మహత్యకు పాల్పడ్డారు. కొన్ని రోజులుగా ఇంట్లో నుంచి ఎవరూ బయటకు రాకపోవడం.. ఇంట్లో నుంచి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు.. ఇంటి తలుపులు తెరిచి చూడగా.. అక్కాచెల్లెలు విగతజీవులుగా పడి ఉన్నారు. మృతులను వీనా, మీనాగా పోలీసులు గుర్తించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. మానసిక స్థితి బాగలేకపోవడమే ఆత్మహత్యకు కారణమని స్థానికులు అంటున్నారు. వీనా, మీనాల ఆత్మహత్యకు గల కారణాలపై పోలీసులు వివిధ కోణాల్లో ఆరా తీస్తున్నారు. కాగా, ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# పొద్దున్నే మెలకువ వచ్చినా బెడ్? దిగడం లేదా.. అది బద్ధకం కాదు.. జబ్బే..

**హైదరాబాద్ పెన్ పవర్:** ఎండలు మండుతున్నాయి... పొద్దున్నే లేవాలంటే బద్ధకం.. ఒకవేళ మెలకువ వచ్చినా కానీ.. మంచం దిగాలంటే మనసొప్పదు. పని తొందరగా ముగించాలనుకుంటారు. కానీ పూనుకోరు. ఎప్పుడూ హుషారుగా ఉండే వాళ్లు కూడా .. ఈ సీజన్లో పనులకు బద్ధకిస్తుంటారు. ఎండలకు వళ్లంతా ఉడికిపోతోందని ఈ మార్పుపై ఓ తీర్పు ఇస్తారు. ఇది ఎండకు వచ్చిన సమస్యే కానీ పరిష్కారం నీడ పట్టున లేదు. ఈ బద్ధకానికీ మందు అవసరమని నిపుణులు అంటున్నారు. వేసవి కాలంలో చాలా మంది ఎక్కువ సేపు నిద్రపోతారు . నిద్రలేచిన తర్వాత... గంటల తరబడి నిద్రమత్తులోనే ఉంటారు. ఇది మత్తుకాదు. పగలు కూడా బలహీనంగానే ఉంటారు... కండరాలు పట్టేసినట్లుంటాయి... రాత్రి నిద్రలో కాళ్లు గుంజుతుంటాయి. చిన్న పని చేసినా పళ్లు నొప్పులు వేధిస్తుంటాయి. ఈ సమస్యలకు కారణం భగభగమండే ఎండల్లో తిరగడమే కారణం అనుకుంటారు.



చల్లటి నీళ్లు, జ్యూస్, ఐస్ క్రీములు విరుగుడనుకుంటారు. ఇంకొందరు విశ్రాంతి తీసుకుంటారు. అయినా నీరసం, బద్ధకం, నొప్పులు వదలవు. ఎందుకంటే ఎండల ప్రభావంతో శరీర జీవన క్రియల్లో మార్పులొస్తాయి. ఆ మార్పుని గుర్తించకపోతే ఈ చిన్న సమస్యలే పెద్దవయ్యే ప్రమాదముంది.

వేడికి చెమట పడుతుంది. ఆ చెమటతో శరీరం నీటినే కాదు..లవణాలనూ కోల్పోతోంది. శరీరం లవణాలను కోల్పోతే జీవక్రియలు దారితప్పుతాయి. దానికి సంకేతమే తలతిరగడం.. బద్ధకం కండరాలు పట్టేయడం.. కండరాల నొప్పులు మన శరీర అవసరాలకు కావాల్సిన సోడియం, పొటాషియం, క్లోరైడ్, లోపం వల్ల కూడా వడదెబ్బ లక్షణాలు కనిపిస్తాయి. చెమట పోయడం వల్ల సోడియం... క్లోరైడ్లను శరీరం ఎక్కువగా కోల్పోతుంది. వీటి లోపం వల్ల శరీరంలో జీవద్రవ్యాల ఉత్పత్తిపై ప్రతికూల ప్రభావం ఉంటుంది. ముఖ్యంగా మన మెదడును చురుకుగా ఉంచే న్యూరో కెమికల్స్ ఉత్పత్తి తగ్గుతుంది. మనం హుషారుగా ఉండేందుకు దోహదపడే. ఎండాన్స్, సెరటోనిన్స్, ఎంకెఫాలిస్ ఉత్పత్తి తగ్గుతుంది. ఈ ఎలక్ట్రోలైట్స్ తగ్గడం వల్ల తల తిరుగుతున్నట్లుగా ఉంటుంది. ఎక్కువగా చిరాకు పడతారు. చిన్న విషయాలకు కూడా ఎక్కువగా స్పందిస్తూ ఉంటారు. కండరాల కదలికలకపై కూడా లవణాల లోపం... ప్రభావం చూపుతుంది. కండరాలకు ఆక్సిజన్? సరిగా అందదు. అందువల్ల కాళ్లు ఎక్కువగా తిమ్మిరి పడతాయి. కండరాల్లో లాక్టిక్ యాసిడ్ ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. అందువల్ల చిన్న పని చేసినా కండరాలు అలసిపోతాయి. ఎక్కువ సమయం శ్రమ చేసేందుకు సహకరించవు. నిద్రపోయేప్పుడు, విశ్రాంతి తీసుకునేప్పుడు కాళ్లు గుంజుతాయి. అసిడిటీ పెరుగుతుంది. దానివల్ల అల్సర్? కు దారి తీస్తుంది.

### హైపోనట్రేమియా

చెమట ఉప్పగా ఉండటానికి కారణం సోడియం మన శరీరానికి కావాల్సిన మోతాదులో లవణం మనం తీసుకునే ఆహారంలో ఉంటుంది. రక్తంలో సోడియం తగ్గితే మెదడు పనితీరు మందగిస్తుంది. వేసవిలో పగలే కాదు, రాత్రి వేళల్లో కూడా చెమట పోస్తుంది, ఈ చెమటతో పాటే సోడియం లవణాలు కూడా బయటకు పోతాయి. రక్తంలో సోడియం శాతం తగ్గుతుంది. కిడ్నీలు, గుండె సరిగా పనిచేయకపోవడం వల్ల కూడా రక్తంలో సోడియం శాతం తక్కువగా ఉంటుంది. కొన్ని రకాల మందుల ప్రభావం వల్ల కూడా ఇది జరుగుతుంది. సోడియం లోపాన్ని “హైపో నట్రేమియా’ అంటారు. ఈ సమస్యతో ఉన్న వాళ్లు గందరగోళంగా వ్యవహరిస్తూ ఉంటారు. మెదడు చురుగ్గా పనిచేయదు. సోమరితనం పెరుగుతుంది. సోడియం తగ్గుతూ ఉంటే ఈ లక్షణాలు కూడా పెరుగుతూ ఉంటాయి. కాళ్లు .. చేతులు గుంజుతున్నట్లుగా ఉంటుంది. కండరాలు పట్టిస్తాయి. వేగంగా కదలడానికి కండరాలు సహకరించవు.

### హైపోకలేమియా

సాధారణ వ్యక్తిలో ఉండే లీటరు రక్తంలో 3.6 నుంచి 5.2 మిల్లీ మాల్స్ పరిమాణంలో పొటాషియం ఉంటుంది. సమతులాహారం తీసుకోకపోవడం వల్ల రక్తంలో పొటాసియం పరిమాణం తగ్గుతుంది. మద్యం తాగడం, దీర్ఘకాల కిడ్నీ వ్యాధులు, మధుమేహం, డయేరియా, అధికంగా చెమటలు పట్టడం, ఫోలిక్ యాసిడ్ లోపం, వాంతులు, కొన్ని రోగాలకు వాడే మందుల ప్రభావం వల్ల శరీరంలో పొటాషియం పరిమాణం తక్కువగా ఉంటుంది. ఈ పరిస్థితిని. ‘హైపోకలేమియా’ అంటారు. ఈ సమస్య ఉన్నవాళ్లలో రక్తపోటులో అసాధారణ మార్పులుంటాయి. కండరాల నొప్పులతో బాధపడతారు. కండరాలు బలహీన పడడం వల్ల కాళ్లు, చేతులు అప్పుడప్పుడూ వణుకుతూ ఉంటాయి.

### హైపోక్లోరేమియా

వాంతులు.. విరేచనాలు.. చెమట పట్టడం, జ్వరం వల్ల శరీరం క్లోరెడ్? ను కోల్పోతుంది. చాలా మందిలో క్లోరైడ్ లోపాన్ని గుర్తించే లక్షణాలు వెంటనే బయటపడవు

### కదలికతో ఉపశమనం

సోడియం, పొటాషియం, క్లోరైడ్ లోపం ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకోవాలి. ఈ సమస్యలు నుంచి ఉపశమనం కోసం యోగా, మెడిటేషన్, స్విమ్మింగ్, వ్యాయామం చేయాలి. వీటివల్ల రక్తప్రసరణ మెరుగవుతుంది. కండరాల్లోకి రక్తప్రసరణ పెంచేందుకు మసాజ్ చేయాలి. కేరళ అభ్యంగన మర్మ తెరపీ వల్ల మంచి ప్రయోజనాలుంటాయి. ఈ సమస్య ఉన్న రోజుల్లో వారానికి ఓసారి 45 నుంచి 60 నిమిషాల పాటు మసాజ్ చేయించుకోవాలి. ప్రాణాయామం కూడా కండరాలకు రక్తప్రసరణ పెంచుతుంది. వ్యాయామం చేయడం వల్ల మెదడులో న్యూరో కెమికల్స్ విడుదలవుతాయి. మనసు ఆహ్లాదంగా ఉంటుంది. కండరాలు పనితీరు కూడా మెరుగవుతుంది.

# ఏడాదికి టోల్ పాస్ రూ.3వేలే.. శాటిలైట్ ఆధారిత టోల్ అప్పటి నుంచే..




**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలోని హైవేలు, ఎక్స్ప్రెస్‌వేలపై సమస్యలను తగ్గించేందుకు కొత్త టోల్ పాలసీలో మార్పులను తీసుకొస్తున్నారు. ఈ క్రమంలో రుసుములను సగటున 50 శాతం వరకు తగ్గించాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోంది. అలాగే రానున్న కాలంలో వార్షిక పాసులను రూ.3వేలకు అందించాలని ప్లాన్ చేస్తున్నారని వెల్లడైంది. ఇది అన్ని నేషనల్ హైవేలతో పాటు రాష్ట్రాల ఆధీనంలో ఉండే ఎక్స్ప్రెస్‌వేలపై కూడా చెల్లుబాటు అవుతాయని తెలుస్తోంది.

అలాగే రుసుమును ఫాస్టాగ్ ద్వారా చెల్లించటానికి వీలుంటుందని వెల్లడైంది. అలాగే కొత్త టోల్ పాలసీ కింద గేట్లు తెరచుకోవటానికి, క్లోజ్ అవ్వటానికి గడువు ఉండనుంది. కొత్త పాలసీలో టోల్ ప్లాజాల ఏర్పాట్లకు బదులుగా కిలోమీటరుకు ఫిక్స్‌డ్ ఛార్జీలను వసూలు చేస్తారు. సుమారుగా, ఒక కారు వంద కిలోమీటర్లకు రూ. 50 టోల్ ఫీజు చెల్లించాలి. ప్రస్తుతం నెలవారీ పాస్‌లు మాత్రమే జారీ చేస్తుండగా కొత్త పాలసీ కింద ఏడాది కాలానికి పాస్ లను అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త పాలసీ కింద కాంట్రాక్టర్లతో ఒప్పందాల కింద కొన్ని ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. దీంతో వారికి కలిగే నష్టాలను భర్తీ చేసేందుకు కేంద్ర రోడ్డు రవాణా మంత్రిత్వ శాఖ అంగీకరించింది. ఇప్పటికే దీనిని మూడు చోట్ల ప్రయోగాత్మకంగా అమలు చేయటా సానుకూల ఫలితాలు వచ్చాయని వెల్లడైంది. అయితే కొత్త విధానం కింద బ్యాంకులకు మరిన్ని కొత్త పవర్స్ రానున్నాయి. అలాగే టోల్ చెల్లించకుండా వెళ్లే వాహనాలను నివారించటానికి భారీగా ఫైన్స్ కూడా తీసుకురావాలని కేంద్రం నిర్ణయించింది.

### నితిన్ గడ్కరీ ఏమన్నారంటే..?

కొత్త వ్యవస్థ ప్రస్తుతం ఉపయోగిస్తున్న FASTag వ్యవస్థ కంటే మెరుగైన టోల్ కలెక్షన్ విధానాన్ని నిర్ధారిస్తుందని కేంద్రం నమ్ముతోంది. రానున్న కాలంలో జీపీఎస్ ఆధారిత విధానాన్ని అమలు ద్వారా టోల్ ప్లాజాల వద్ద రద్దీని తగ్గించటంతో పాటు ఆలస్యాలను నివారించాలని రవాణా సంస్థ నిర్ణయించింది. దీని ద్వారా నేరుగా బ్యాంక్ ఖాతా నుంచి ప్రయాణించిన కిలోమీటర్లకు మాత్రమే టోల్ చెల్లించాల్సి ఉంటుంది. రానున్న 15 రోజుల్లో శాటిలైట్ ఆధారిత టోల్ వసూలు విధానాన్ని అమలులోకి తీసుకురానున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు.

# వేలంలో రూ.25 వేలు పలికిన నిమ్మకాయ



- తమిళనాడులోని ఈరోడ్‌లోని ఓ దేవాలయంలో వేలం
- సదాయప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు
- స్వామివారి పూజలో ఉంచిన నిమ్మకాయను వేలం వేసిన అధికారులు


**హైదరాబాద్ పెన్ పవర్:**తమిళనాడులో ఒక నిమ్మకాయ వేలం పాటలో రూ. 25 వేలు పలికింది. తమిళనాడు నూతన సంవత్సరం సందర్భంగా ఈరోడ్ జిల్లాలోని శివగిరిలో గల సదాయప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి పూజలో ఉంచిన నిమ్మకాయను ఆలయ అధికారులు వేలం వేశారు. ఈ వేలంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కందసామిపాలెం నుంచి వచ్చిన ఒక భక్తుడు రూ. 25 వేలకు ఆ నిమ్మకాయను సొంతం చేసుకున్నారు. తమిళనాడు నూతన సంవత్సరం సందర్భంగా ప్రతి సంవత్సరం స్వామి వారి పూజకు ఉపయోగించిన సామగ్రిని వేలం వేయడం ఆనవాయతీ అని ఆలయ అధికారులు తెలిపారు.

# జపాన్‌లో రికార్డు స్థాయిలో తగ్గిన జనాభా!



**హైదరాబాద్ పెన్ పవర్:**జపాన్‌లో యువశక్తి విషయంలో సంక్షోభం కొనసాగుతోంది. సోమవారం వెలువడిన అధికారిక డేటా ప్రకారం 2024 అక్టోబర్ నాటికి ఆ దేశ జనాభా 120.3 మిలియన్లకు పడిపోయింది. 2023తో పోలిస్తే రికార్డు స్థాయిలో 8.98 లక్షల జనాభా తగ్గింది. 1950లో ప్రభుత్వం పోల్చదగిన డేటాను సేకరించడం ప్రారంభించినప్పటి నుంచి ఇది రికార్డు స్థాయిలో అతిపెద్ద పతనం అని అంతర్గత వ్యవహారాల మంత్రిత్వ శాఖ పేర్కొంది. మరోవైపు జననాల రేటును పెంచేందుకు అక్కడి ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు అందిస్తోంది. అయినా జపాన్ యువత వివిధ కారణాలతో పెళ్లి, పిల్లల విషయంలో ఆలస్యం చేస్తోంది. దీంతో ప్రపంచంలోనే జపాన్ అత్యల్ప బర్త్ రేట్‌ను నమోదు చేసింది. పిల్లలు కావాలని కోరుకునే యువ కుటుంబాలకు ఆర్థికంగా సహాయం అందించడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చీఫ్ క్యాబినెట్ కార్యదర్శి యోషిమాసా హయాషి అన్నారు.అటు జపాన్‌లో విదేశీయులు కూడా భారీగానే తగ్గుతున్నారు. జపాన్ యువ విదేశీయులను తమ శ్రమ వనరుగా మార్చుకుంది. కానీ ప్రభుత్వం కఠినమైన వలస విధానాన్ని కొనసాగించింది. ప్రస్తుతం విదేశీ కార్మికులను తాత్కాలిక ప్రాతిపదికన మాత్రమే అనుమతిస్తోంది. దీంతో ఆ దేశంలో విదేశీయుల జనాభా కూడా గణనీయంగా తగ్గినట్లు తాజాగా వెలువడిన డేటాలో తేలింది.

# కర్నాటక లారీల సమ్మె: 24 రాష్ట్రాలపై ఎఫెక్ట్..!




**హైదరాబాద్ పెన్ పవర్:** కర్ణాటక లారీ యజమానులు, ఏజెంట్ల సంఘం నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చింది. ఇంధన ధరల పెరుగుదల, టోల్ ప్లాజాలలో ఎదురవుతోన్న వేధింపులకు వ్యతిరేకంగా 2025, ఏప్రిల్ 14 అర్ధరాత్రి నుంచి స్ట్రైక్?కు దిగారు. ఒక్క పాలు రవాణా చేసే ట్రక్కులు తప్ప.. మిగతా అన్ని ట్రక్కులు రోడ్లపై తిరగవని అసోసియేషన్ వెల్లడించింది. సమ్మె ఎఫెక్ట్?తో రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 6 వేల ట్రక్కులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. నిత్యావసరాలు, నిర్మాణ సామాగ్రి, పెట్రోల్, ఎల్‌పీజీ, ఇతర వస్తువులను రవాణా చేసే ట్రక్కులు రోడ్డెక్క లేదు.

కర్ణాటక లారీ యజమానుల అసోసియేషన్?కు సమ్మెకు 24 రాష్ట్రాల నుంచి 60కి పైగా రవాణా సంఘాలు మద్దతు ప్రకటించాయి. సమ్మె సమయంలో ఈ 24 రాష్ట్రాల నుంచి ట్రక్కులు కర్ణాటకలోకి ప్రవేశించవు.కర్ణాటక లారీ యజమానుల అసోసియేషన్? అధ్యక్షుడు జి.ఆర్. షణ్ముగప్ప మాట్లాడుతూ.. కర్ణాటక ప్రభుత్వం కేవలం ఏడు నెలల వ్యవధిలో రెండుసార్లు డీజిల్ ధరను పెంచిందని.. దీని వలన నిర్వహణ ఖర్చులు పెరిగి ట్రక్కులు నడపడం గుదిబండగా మారిందన్నారు.

డీజిల్ ధరల పెరుగుదల కర్ణాటకలోని ప్రతి పౌరుడిని ప్రభావితం చేసిందన్నారు. ప్రభుత్వం వెంటనే డిజిల్ ధరల తగ్గింపుపై నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే.. ట్రక్కర్లకు టోల్ ప్లాజాలలో ఎదురవుతోన్న వేధింపులకు వ్యతిరేకంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సమ్మె కారణంగా కర్ణాటక నుంచి తమిళనాడుకు రోజుకు 4,000 లోడ్ల కూరగాయలు, బియ్యం, మందులు, ఇతర నిత్యావసర వస్తువుల సరఫరా నిలిచిపోతుందన్నారు. కూరగాయాల కోసం ఎక్కువగా కర్నాటకపై ఆధారపడే చెన్నైపై ఈ ప్రభావం వెంటనే పడుతోందని తెలిపారు. కర్ణాటక లారీ యజమానుల సమ్మె ప్రభావం వ్యాపారులతో పాటు సామాన్య ప్రజలపైన పడుతోంది. దాదాపు 24 రాష్ట్రాలపై ఈ సమ్మె ప్రభావం చూపించింది. సరఫరా ఆగిపోవడంతో నిత్యవసరాల ధరలు పెరుగుతున్నాయి. పెట్రోల్, డిజిల్ బంకుల వద్ద నో స్టాక్ బోర్డులు దర్శనం ఇస్తుండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి.. లారీ యజమానుల అసోషియేషన్?తో చర్చలు జరిపి సమస్యలు పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

**కర్నాకట లారీ యజమానుల అసోషియేషన్ ప్రధాన డిమాండ్స్:**

**కర్ణాటకలో టోల్ వసూలును రద్దు చేయడం**

**రాష్ట్ర సరిహద్దుల్లో RTO చెక్‌పోస్టులను తొలగించడం**

**ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పునరుద్ధరణకు రూ.15,000 వసూలు చేయాలన్న కేంద్రం ఆదేశాన్ని ఉపసంహరించుకోవడం.**

**రాజధాని బెంగళూరులో ట్రక్కులకు 'నో ఎంట్రీ' పరిమితిని సడలించడం**

# రైతులకు IMD గుడ్ న్యూస్.. 2025లో సాధారణం కంటే ఎక్కువ వర్షాలు



**హైదరాబాద్ పెన్ పవర్:** రైతులకు భారత వాతావరణ శాఖ శుభవార్త చెప్పింది. 2025 సంవత్సరంలో సాధారణం కంటే ఎక్కువగా వర్షాలు కురుస్తాయని ఐఎండీ అంచనా వేసింది. సగటున105 శాతం వర్షపాతం నమోదు అవుతుందని వెల్లడించింది. వాయువ్య, దక్షిణ ద్వీపకల్ప భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు మినహా దేశంలోని చాలా ప్రాంతాలలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని.. ఇక్కడ సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే ఛాన్స్ ఉందని తెలిపింది. రుతుపవనాల సమయంలో తటస్థ ఎల్ నినో పరిస్థితులు ఉంటాయని.. ఇది రుతుపవన పరిస్థితులకు అనుకూలంగా ఉంటుందని ఐఎండీ పేర్కొంది.కాగా, భారతదేశంలో రుతుపవనాలు సాధారణంగా జూన్ 1న దక్షిణ రాష్ట్రమైన కేరళలో ప్రారంభమై సెప్టెంబర్ మధ్యకాలం వరకు కొనసాగుతాయి. భారత వాతావరణ శాఖ సాధారణ వర్షపాతాన్ని 50 సంవత్సరాల సగటు వర్షపాతం 87 సెం.మీ ప్రామాణికంగా తీసుకుని 96% నుంచి 104% మధ్య పడుతుందని అంచనా వేస్తుంది. దీని ఆధారంగా ఈ ఏడాది 105 శాతం వర్షపాతం అంటే.. సగటు కంటే ఎక్కువే. ఇది వ్యవసాయ రంగానికి ప్రోత్సాహకరంగా ఉంటుందని ఐఎండీ అంచనా.ఐఎండీ అంచనా దేశవ్యాప్తంగా లక్షలాది మంది రైతులకు శుభవార్త లాంటిందే. ఎందుకంటే దేశంలోని నికర సాగు విస్తీర్ణంలో 52% రుతుపవనాల వర్షాలపై ఆధారపడే వ్యవసాయం చేస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది సాధారణం కంటే ఎక్కువ వర్షాలు పడితే.. ఇది పంట ఉత్పత్తికి, త్రాగునీరు, విద్యుత్ ఉత్పత్తికి కీలకమైన జలాశయాల నింపడానికి చాలా ఉపయోగపడుతోంది.

# ప్రభుత్వ పథకాల లబ్ది అర్హులకు అందేలా పకడ్బందీగా కార్యాచరణ చేపట్టాలి... ఇంఛార్జ్ కలెక్టర్ డా. శ్రీజ.

- రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల స్క్రూటిని ప్రక్రియకు ఏర్పాట్లు చేయాలి
- ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రక్రియ వేగవంతం చేయాలి
- వేసవిలో త్రాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలి
- రెవెన్యూ సదస్సులకు కార్యాచరణ చేపట్టాలి
- రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇండ్లు, త్రాగునీరు, భూ భారతి పై అధికారులతో సమీక్ష చేసిన ఇంచార్జ్ కలెక్టర్



**హైదరాబాద్ పెన్ పవర్:**రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పథకాల లబ్ది అర్హులకు అందేలా పకడ్బందీగా కార్యాచరణ అమలుచేయాలని ఇంచార్జ్ కలెక్టర్ డా. పి. శ్రీజ అన్నారు. మంగళవారం ఇంచార్జ్ కలెక్టర్, కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో అధికారులతో రాజీవ్ యువ వికాసం, ఇందిరమ్మ ఇండ్లు, త్రాగునీరు, భూ భారతి లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ, యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం రాజీవ్ యువ వికాసం పథకం ప్రవేశపెట్టినట్లు, ఈ పథకం ద్వారా చిన్న తరహా పరిశ్రమలు లేదా యూనిట్ల ఏర్పాటుకు యువతకు సబ్సిడీతో 4 లక్షల వరకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఎస్సి కార్పొరేషన్ ద్వారా 29091, గిరిజన సంక్షేమ శాఖ ద్వారా 14220, బీసీ కార్పొరేషన్ ద్వారా 41881, మైనారిటీ కార్పొరేషన్ ద్వారా 6658 దరఖాస్తులు, మొత్తంగా 91850 దరఖాస్తులు సోమవారం నాటికి అందినట్లు, అన్ని దరఖాస్తులు ఆన్లైన్ ప్రక్రియ పూర్తిచేసినట్లు ఇంచార్జ్ కలెక్టర్ అన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల విషయమై అర్హులై, ప్లాట్లు ఉన్న ఎల్1 జాబితాను ఎంపిడివో సంతకంతో తీసుకొని, ఆమోదం కొరకు ఇందిరమ్మ కమిటీ ముందు ఉంచాలన్నారు. ఇందిరమ్మ కమిటీ ఆమోదం తర్వాత మండల ప్రత్యేక అధికారి ఆయా జాబితాను జిల్లా ఇంచార్జ్ మంత్రివర్యుల ఆమోదం కొరకు సమర్పించాలన్నారు. ఇంచార్జ్ మంత్రుల ఆమోదం తప్పనిసరి అని తెలిపారు. వేసవి దృష్ట్యా జిల్లాలో త్రాగునీటికి ఎక్కడా సమస్యలు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టాలని ఇంచార్జ్ కలెక్టర్ అన్నారు. నియోజకవర్గాల వారిగా కావాల్సిన పనుల విషయమై నివేదిక సమర్పించాలన్నారు. ఇంట్రా, గ్రిడ్ లకు 1 లేదా 2 బఫర్ లు పెట్టాలన్నారు. క్రొత్తగా కాలనీలు, హాబీటేషన్ లు ఏర్పడ్డ చోట పైప్ లైన్ పొడిగింపుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. వనరుల మరమ్మత్తులు, ప్రత్యామ్నాయ వనరులు, వనరులు లేనిచోట మున్నగు వాటికి ఖర్చు విషయమై క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. అత్యవసర త్రాగునీటి అవసరాల నిమిత్తం కలెక్టర్ వద్ద నిధుల మంజూరికి పనుల గుర్తింపు వెంటనే చేపట్టాలన్నారు.

భూ భారతి అమలుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు ఇంచార్జ్ కలెక్టర్ అన్నారు. భూ భారతి అమలు విషయమై పైలట్ ప్రాజెక్ట్ క్రింద జిల్లాలోని నేలకొండపల్లి మండలాన్ని ఎంపిక చేశారని తెలిపారు. మండల హెడ్ క్వార్టర్స్ లో భూ భారతి చట్ట అమలుపై అవగాహన కార్యక్రమం చేపడతామన్నారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల ఏర్పాటుకు షెడ్యూల్ రూపొందించాలన్నారు. గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల విజయవంతానికి తహసీల్దార్, ఎంపిడివో, ఎంపీవో, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో లబ్ధిదారుల సమీకరణ, అవగాహన కల్పనకు పటిష్టమైన ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పి సిఇఓ దీక్షా రైనా, జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత, మిషన్ భగీరథ ఇఇ పుష్పలత, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఎంపిడిఓ లు, ఎంపీవో లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కేసు కొట్టివేయాలంటూ రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ

**2016లో రేవంత్ రెడ్డిపై కేసు నమోదు**

**కేసును కొట్టివేయాలంటూ 2020లో రేవంత్ రెడ్డి పిటిషన్**

**పిటిషన్‌ను వేరే బెంచ్‌కు బదిలీ చేయాలని రిజిస్ట్రీకి ఆదేశం**



**హైదరాబాద్ పెన్ పవర్:**గతంలో తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో నేడు విచారణ జరిగింది. రేవంత్ రెడ్డిపై గతంలో గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసును కొట్టివేయాలంటూ ఆయన హైకోర్టును ఆశ్రయించారు.గోపన్‌పల్లిలోని భూవివాదంలో ఒక వ్యక్తి ఫిర్యాదు మేరకు 2016లో రేవంత్ రెడ్డిపై కేసు నమోదైంది. ప్రస్తుతం ఈ కేసు రంగారెడ్డి జిల్లా కోర్టులో విచారణలో ఉంది. ఆ కేసును కొట్టివేయాలంటూ 2020లో ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా దీనిపై విచారణ చేపట్టిన న్యాయమూర్తి, ఆ పిటిషన్‌ను వేరే బెంచ్‌కు బదిలీ చేయాలని రిజిస్ట్రీని ఆదేశించారు.

# ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకాల పటిష్ట అమలుకు నియోజకవర్గ ప్రత్యేక అధికారుల నియామకం..

**ఉత్తర్వులు జారీచేసిన ఇంచార్జ్ కలెక్టర్ డా. శ్రీజ**

**హైదరాబాద్ పెన్ పవర్:**జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందేలా పటిష్ట పర్యవేక్షణకు నియోజకవర్గ స్థాయి ప్రత్యేక అధికారులను నియమిస్తూ ఇంచార్జ్ కలెక్టర్ డా. పి. శ్రీజ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఖమ్మం నియోజకవర్గానికి జెడ్పి సిఇఓ దీక్షా రైనా, పాలేరు కు ఎస్డీసి ఎం. రాజేశ్వరి, మధిర కు జిల్లా పంచాయతీ అధికారిణి ఆశాలత, వైరా కు డివిజనల్ పంచాయతీ అధికారి టి. రాంబాబు, సత్తుపల్లి నియోజకవర్గానికి ఎల్. రాజేంద్ర గౌడ్ లు ప్రత్యేక అధికారులుగా నియమించినట్లు ఆ ఉత్తర్వుల్లో తెలిపారు. దరఖాస్తుల సర్వే, వందశాతం అర్హులైన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియకు నియోజకవర్గ ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తారన్నారు. పథకాల గ్రౌండింగ్ కు నియోజకవర్గ ప్రత్యేక అధికారులు చర్యలు చేపట్టాలని, ఒక్క ఫిర్యాదు రాకుండా ప్రత్యేక శ్రద్ధతో పర్యవేక్షణ చేపట్టాలని ఇంచార్జ్ కలెక్టర్ ఆదేశించారు.



# ఏప్రిల్ 17 న మహిళలకు జాబ్ మేళా నిర్వహణ .... జిల్లా ఉపాధి అధికారిణి మాధవి

**హైదరాబాద్ పెన్ పవర్:**డిగ్రీ అర్హత గల మహిళలు మాత్రమే జాబ్ మేళాకు హాజరు కావాలి

జిల్లాలోని నిరుద్యోగ మహిళలకు రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించుటకు ఈనెల 17న గురువారం ఉదయం 10.00 గంటలకు ఖమ్మం గాంధీ చౌక్ లోని కోటక్ మహీంద్రా బ్యాంకు పైన ఉన్న రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్ కార్యాలయం నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

30-45 సంవత్సరాల వయస్సు కలిగి, డిగ్రీ పాసైన మహిళలు అర్హులని, ఎంపికైన వారికి వేతనం 20 వేల నుండి 25 వేల వరకు ఉంటుందని, ఎంపికైన వారు ఖమ్మం జిల్లాలో పనిచేయవలసి ఉంటుందని అన్నారు. మొత్తం 20 ఉద్యోగ ఖాళీల భర్తీకి గాను జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు, తమ విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో మహిళలు జాబ్ మేళాకు హాజరు కావాలని జిల్లా ఉపాధి అధికారిణి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## అంబెద్కర్ విగ్రహానికి చెప్పులు

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు ఘోర అవమానం జరిగింది.ఏపీలోని కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలంలో అంబేద్కర్ విగ్రహానికి గుర్తు తెలియని వ్యక్తులు చెప్పుల దండ వేశారు.అది గమనించిన అంబేద్కరిస్టులు, దళిత సంఘాలు రోడ్డెక్కి తీవ్ర ఆందోళనలు చేపట్టారు.నిందితులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని దళిత సంఘాల డిమాండ్ చేస్తున్నాయి. సమస్య తీవ్రతను గుర్తించిన పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పరిస్థితిని సమీక్షిస్తున్నారు. కాగా, ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## ఆలీ బాబా నలబై దొంగలు సినిమా చూసాం

**హైదరాబాద్ పెన్ పవర్:**అతను కరుడు గట్టిన నిందితుడు ఒకటి రెండు కాదు ఏకంగా 22 కేసుల్లో ముద్దాయి 2019 నుంచి నంద్యాల, గుంటూరు జిల్లాల్లో యదేచ్ఛగా దారి దోపిడిలు, చోరిలకు పాల్పడుతూ పోలీసులకు చుక్కలు చూపిస్తున్న చెంచు హనుమంతు ను ఎట్టకేలకు నంద్యాల పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు.జిల్లా ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా వెల్లడించిన వివరాల ప్రకారం. పాణ్యం మండలానికి చెందిన చెంచు హనుమంతు అనే వ్యక్తి 2019 నుండి ఇప్పటి వరకు నంద్యాల, గుంటూర్ జిల్లాల్లో దారిదోపిడీలు, దొంగతనాలకు పాల్పడుతున్నాడు. గత కొన్ని రోజులుగా పోలీసులకు దొరకుండా తప్పించుకొని తిరుగుతున్న హనుమంతును సుగాలిమెట్ట గ్రామ సమీపంలోని జంబులమ్మ గుడివద్ద అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన సమయంలో అతని వద్ద ఉన్న బంగారు, వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ చెప్పారు.తాగుడు, జల్సాలకు అలావాటు పడిన చెంచు హన్మంతు ఈజీ మనీ కొసం దొంగతనాలు చేయడం మొదలు పెట్టాడు. అదే ప్రాంతానికి చెందిన దాసరి అంకన్న, చెంచు సుంకన్న, హరిచంద్రుడు అనే నలుగురి వ్యక్తులతో కలిసి ఓ ముఠాగా ఏర్పడి దోపిడిలకు పాల్పడినట్లు విచారణలో తేలిందని ఎస్పీ తెలిపారు. ఈ ముఠా పాణ్యం, నంద్యాల చుట్టు పక్కల గ్రామాల్లో దారి దోపిడీలు, దొంగతనాలకు పాల్పడుతూ వచ్చిన సొమ్మును సమానంగా పంచుకొనేవారని, వీరిపై నంద్యాల జిల్లాలో 22 కేసులు ఉన్నట్టు తెలిపారు.2019 నుంచి పోలీసులకు దొరక్కుండా తప్పించు తిరుగుతున్న ముద్దాయి హనుమంతు ను పట్టుకున్న నంద్యాల జిల్లా పోలీసులను కర్నూల్ డిఐజి కోయల ప్రవీణ్ కుమార్ అభినందించారు.

## గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహిద్దాం..

**హైదరాబాద్ పెన్ పవర్:**తాతయ్యగుంట గంగమ్మ జాతరను అద్భుతంగా నిర్వహించేందుకు అందరూ కలసికట్టుగా పని చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం తాతయ్యగుంట గంగమ్మ గుడిలో జాతరకు చేయాల్సిన ఏర్పాట్లపై డిప్యూటీ మేయర్ ఆర్.సి.మునికృష్ణ, అన్ని విభాగాల అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. గతంలో ఏర్పాట్లు, ప్రస్తుతం చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తాతయ్యగుంట గంగమ్మ జాతర వైశిష్ట్యానికి తగ్గట్టుగా అన్ని ఏర్పాట్లు ఏర్పాట్లు చేసేందుకు అధికారులు, సిబ్బంది ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. నగరపాలక సంస్థ తరపున చేయాల్సిన అన్ని ఏర్పాట్లను పరిశీలించాలని అన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా త్రాగునీరు సరఫరా చేయాలని, వాహనాలు పార్కింగ్, క్యూ లైన్ల ఏర్పాటు, భక్తులు పొంగళ్ళు పెట్టుకునేందుకు చేయాల్సిన ఏర్పాట్లపై అధికారులు అన్ని ప్రణాళికలు సిద్ధం చేయాలని అన్నారు. అలాగే భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయాలని అన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని అన్నారు. కమిషనర్ వెంట తాతయ్య గుంట గంగమ్మ గుడి ఈఓ జయకుమార్, కోటేశ్వర రావు,శానిటరీ సూపర్ వైజర్ సుమతి తదితరులు ఉన్నారు.

# కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:**కార్మిక వ్యతిరేకమైన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని కేంద్రప్రభుత్వాన్ని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లాలోని అన్ని కార్మిక సంఘాల జిల్లా సదస్సు మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి ముత్యం రావు, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి కడారి సునీల్, ఐ ఎన్ టి యు సీ బూమల్ల చందర్, ఐ ఎఫ్ టీ యు నాయకులు కె. విశ్వనాథ్, సిహెచ్ శంకర్, టి యు సీ ఐ నాయకులు వైకుంఠం పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలో ని ఎన్డీఏ ప్రభుత్వం తన కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను, కార్పొరేట్ అనుకూల, మతోన్మాద చర్యలను మరింత దూకుడుగా అమలు చేస్తున్నట్లు ఆరోపించారు. కార్మికవర్గం సమరశీల పోరాటాల ద్వారా 100 సంవత్సరాలలో సాధించుకు న్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో 4 లేబర్ కోడ్లను ముందుకు తెచ్చిందని మండిపడ్డారు. వీటికి వ్యతిరే కంగా గత ఐదేళ్ళుగా కార్మికవర్గం చేస్తున్న ఆందోళన, పోరాటాలతో లేబర్ కోడ్ల అమలు 5 ఏళ్లు ఆలస్యమైనా, ఇప్పుడు వాటిని అమలు చేసి కార్మిక హక్కులను పూర్తిగా హరించే ప్రయత్నం చేస్తోందని కేంద్రంపై దుమ్మెత్తిపోశారు. 2025-26 బడ్జెట్లో తమ కార్పొరేట్ అనుకూల విధానాలకు అనుగుణంగా కేటాయింపులు చేసిందని, సామాజిక సంక్షేమానికి మాత్రం కోతలు పెట్టిందని విమర్శించా రు. సామాన్యులపై భారాలు మోపి, కార్పొరేట్ గుత్త సంస్థలకు, పెట్టుబడిదారులకు వేల కోట్ల రాయితీలు ప్రకటించిందని దుయ్యబట్టారు. ఉపాధి, నిరుద్యోగం, అధిక ధరలు, ఆకలి, అసమానతలు, ఆరోగ్య రక్షణ లాంటి ప్రాథమిక సమస్యలను పట్టించుకోక పోగా, ఈ సమస్యలు మరింత తీవ్రరూపం దాల్చే ఆర్థిక విధానాలను కేంద్ర ప్రభుత్వం విచక్షణారహితంగా అమలు చేస్తున్నదని ఆగ్రహించారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను వెనక్కి నెట్టి భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షించుకొనేందుకు కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్లు మే 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేయాలని నిర్ణయించాయని తెలిపారు. ఈ సార్వత్రిక సమ్మెకు సంయుక్త కిసాన్ మోర్చా సంపూర్ణ మద్దతును ప్రకటించిందన్నారు. సమ్మె రోజున గ్రామీణ బందుకు పిలుపునిచ్చిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర కార్మికవర్గం మే 20న జరిగే సమ్మెకు సమాయత్తం కావాలని, సంఘటిత, అసంఘటితరంగ కార్మికులు, ప్రభుత్వరంగ సంస్థల కార్మికులు, ఉద్యోగులందరూ ఈ సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సేపెల్లి రవీందర్, ఏ ఐ టి యు సీ నాయకులు పూసాల రమేష్, ఐ ఎన్ టి యు సీ నాయకులు జె. సమ్మిరెడ్డి, ఐఎఫ్టియు భీమయ్య, అశోక్, నరేష్, టియుసిఐ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# భూభారతిలో అప్పీలు వ్యవస్థ.




**జగిత్యాల: పెన్ పవర్:**భూ వివాదాలు లేని తెలంగాణ లక్ష్యంగా14 ఏప్రిల్2025 న ప్రారంభించిన భూ భారతి చట్టంలో అప్పీలు వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలంగాణ రెవెన్యూ ఉద్యోగుల సర్వీసుల అసోసియేషన్ జగిత్యాల మాజీ అధ్యక్షుడు ,న్యాయవాది హరి ఆశోక్ కుమార్ ప్రజల సమాచారం కోసం తెలిపారు. తహశీల్దార్లు జారీ చేసే పాస్ పుస్తకాల్లో లేదా భూదార్ పై ప్రజాలకెవరికయిన అభ్యంతరాలుంటే రెవెన్యూ డివిజనల్ అధికారి(ఆర్డీవో)కి అప్పీలు చేసుకునేందుకు భూభారతి చట్టంలో సెక్షన్ 15,నిబంధన 14 ద్వారా ప్రభుత్వం అవకాశం కల్పించింది.ఆర్డీవో ఇచ్చిన తీర్పు పై అభ్యంతరాలుంటే జిల్లా కలెక్టర్ కు రెండో దశలో అప్పీలు చేసుకోవచ్చు.ఆర్డీవో చేసిన మ్యుటేషన్ల పై లేదా ఆర్డీవో చేసిన సాదాబైనామాల క్రమబద్ధీకరణపై ఎవరికయినా అభ్యంతరాలుంటే జిల్లా కలెక్టర్ కు అప్పీలు చేసుకునేందుకు వీలుంది.కలెక్టర్ ఇచ్చిన తీర్పు పై అభ్యంతరాలుంటే భూమి ట్రిబ్యునల్ లో అప్పీలు చేసుకోవచ్చు.ఇలా అప్పీలు చేసుకునేందుకు వ్యవస్థ ధరణి చట్టంలో అవకాశం లేక ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు.భాదితులు కోర్టులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉండేది.ఈ ప్రధాన లోపాన్ని సవరిస్తూ భూ భారతి చట్టం లో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో అప్పీలు వ్యవస్థ కు అవకాశం కల్పించినట్లు హరి ఆశోక్ కుమార్ వివరించారు.

# పారదర్శకంగా టీడీఆర్ బాండ్లు పంపిణీ చేస్తున్నాం

**హైదరాబాద్ పెన్ పవర్:**నగరంలో ఏర్పాటు చేసిన మాస్టర్ ప్లాన్ రోడ్లలో భూములు కోల్పోయిన వారికి పారదర్శకంగా టీడీఆర్ బాండ్లు పంపిణీ చేస్తున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో జరుగుతున్న టిడిఆర్ మేళాలో అర్హత పొందిన 22 మందికి సోమవారం టిడిఆర్ బాండ్లను కమిషనర్ అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మాస్టర్ ప్లాన్ రోడ్లలో భూములు కోల్పోయిన ప్రతి ఒక్కరిని ఆన్లైన్ చేయించడం కోసం మేళా నిర్వహిస్తున్నామని అన్నారు 95శాతం ఆన్లైన్ చేశామని, కోర్టు కేసులు, ప్రభుత్వ, టిటిడి భూములు, 22 ఏ కింద ఉన్నవి మాత్రమే పెండింగ్లో ఉన్నాయని అన్నారు. ఇప్పటి వరకు ఐదు బాండ్లు



ఇచ్చామని, సోమవారం 22 టిడిఆర్ బాండ్లు లబ్ధిదారులకు స్వయంగా అందజేశామని అన్నారు. ఖాళీ జాగాలకు లొకాలిటీ వాల్యూ ప్రకారం గుర్తించామని అన్నారు. టిడిఆర్ బాండ్ల కమిటీ సమావేశమై 96 మందికి ప్రీ అప్రూవల్ తీసుకుని అర్హత ఉన్నట్లు గుర్తించామని అన్నారు. వీరందరూ గిఫ్ట్ డీడ్ ఇస్తే తరువాత బాండ్లు అందజేస్తామని అన్నారు. వీరు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలుగా తిరుపతి, రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు కూడా ఏర్పాటు చేశామని అన్నారు. ఈ సమావేశంలో టౌన్ ప్లానింగ్ ఆర్.డి, విజయభాస్కర్, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, డీసీపీ మహా పాత్ర, ఏసీపి లు బాలాజి, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి చట్టం పై ప్రజలలో విస్తృత ప్రచారం కల్పించాలి

**హైదరాబాద్  పెన్ పవర్:**తెలంగాణ ప్రజలకు ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసం ప్రజా ప్రభుత్వం నూతనంగా తీసుకుని వచ్చిన భూ భారతి ఆర్వోఆర్ చట్టం పై విస్తృతంగా ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అన్నారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ భూ భారతి చట్టం అమలు పై అదనపు కలెక్టర్ బి.ఎస్ లత తో కలిసి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సిఎం ప్రజావాణి దరఖాస్తులను ఇంకా నుంచి ప్రతి వారం స్క్రూటినీ చేయడం జరుగుతుందని, వాటి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తెలిపారు..భూ భారతి చట్టం పై తహసిల్దారులు రెవెన్యూ అధికారులు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. భూ భారతి చట్టం యొక్క గెజిట్,రూల్స్ ను రెవెన్యూ శాఖ లో ప్రతి అధికారి తెలుసుకోవాలని అన్నారు.భూ భారతి చట్టంలో రెండంచెల అప్పీల్ వ్యవస్థ ఉందని అన్నారు.భూ పరిధి చట్టం ప్రకారం ఇకపై రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ చేసే సమయంలో సర్వే మ్యాప్ తప్పనిసరి అవుతుందని అన్నారు..వాటికీ సంబంధించిన షెడ్యూలు, వెన్యూ లను తయారు చేసుకోవాలని అన్నారు..ప్రతి రోజు కనీసం 2 అవగాహన కార్యక్రమాలు జరగాలని, ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, రైతులు , ఇతర ప్రజలు ఈ సమావేశాలకు హాజరయ్యేలా చూడాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు..భూ భారతి చట్టం ముందస్తుగా రాష్ట్రంలోని నాలుగు మండలాల్లో పైలెట్ ప్రాజెక్టు కింద ప్రారంభించి, అక్కడ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి వాటిని పరిష్కరించి జూన్ నెలలో పట్టాలు పంపిణీ చేసి రాష్ట్రవ్యాప్తంగా అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు.మన జగిత్యాల జిల్లాలో భూ భారతి చట్టం అమలుకు అధికారులు సన్నద్ధం కావాలని, ప్రజల భూ సమస్యల పరిష్కారానికి పటిష్ట కార్యాచరణ రూపొందించాలని అన్నారు. ప్రస్తుతం మన వద్ద పెండింగ్ ఉన్న ధరణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అన్నారు.ప్రభుత్వ భూముల ఫెన్సింగ్, మార్కింగ్ ప్రక్రియను తహసిల్దార్ లు పూర్తి చేయాలని అన్నారు.ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారులు మధు సుధన్, జివాకర్ రెడ్డి, శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓ లు,తహసిల్దార్ లు, సంబంధిత ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.




# ఇన్ స్టా రీల్స్ చేస్తూ దొరికిన ఖైదీ

**హైదరాబాద్  పెన్ పవర్:** హైదరాబాద్‌లోని చంచల్‌గూడా జైలులో ఉన్న ఓ రిమాండ్ ఖైదీ హ్యాపీగా ఇన్‌స్టా రీల్స్ చేయటమే అందుకు కారణం. ఇందుకు జైలులో భద్రతా లోపాలు కూడా ఓ కారణమనుకోండికొద్ది రోజుల క్రితమే నకిలీ బెయిల్ పత్రాలతో ఓ ఖైదీ విడుదలైన ఘటన మరువకముందే.. చంచల్ గూడా జైలులో తాజాగా రిమాండ్‌లో ఉన్న ఖైదీ ఒకరు ములాఖత్ సమయంలో ఏకంగా సోషల్ మీడియాలో లైవ్ రీల్స్ చేయడం సంచలనం రేపుతోంది. ఈ ఘటన జైలు భద్రతతో పాటు, పోలీసు యంత్రాంగం యొక్క నిఘా వ్యవస్థను సైతం ప్రశ్నిస్తోంది. గతంలో ములాఖత్‌కు వచ్చిన సందర్శకులు ఖైదీలకు రహస్యంగా గంజాయి, సిగరెట్లు వంటి నిషేధిత పదార్థాలు అందించిన ఉదంతాలు వెలుగు చూసినప్పటికీ, జైలు లోపల సెల్‌ఫోన్‌తో వీడియోలు తీయడం ఇదే మొదటిసారి కావడం గమనార్హం.జైళ్ల శాఖ వర్గాల సమాచారం ప్రకారం.. పహాడీషరీఫ్‌లోని షాహీన్‌నగర్‌కు చెందిన మహమ్మద్ అహ్మద్–బిన్–హసన్ అలీ జాబ్రీ అనే 24 ఏళ్ల వ్యక్తిని బెదిరింపు కేసులో టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసి, అనంతరం చాంద్రాయణగుట్ట పోలీసులకు అప్పగించారు. చాంద్రాయణగుట్ట పోలీసులు కేసు నమోదు చేసి, ఈ నెల 12న (శుక్రవారం) జాబ్రీని చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో రిమాండ్‌కు తరలించారు.మరుసటి రోజు (శనివారం), జాబ్రీని కలిసేందుకు అతని స్నేహితులు జైలుకు వచ్చారు. జైలు నిబంధనల ప్రకారం, ములాఖత్ గదిలోకి సెల్‌ఫోన్‌లు గానీ, మరే ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరు. ఖైదీలు ఒక గాజు గోడ అవతల ఉండగా, వారి బంధువులు, స్నేహితులు ఇటువైపు నుంచి ఇంటర్‌కామ్ ఫోన్ ద్వారా మాత్రమే మాట్లాడటానికి అవకాశం ఉంటుంది. అయితే, జాబ్రీ స్నేహితులు నిబంధనలను ఉల్లంఘించి రహస్యంగా సెల్‌ఫోన్‌ను లోపలికి తీసుకువెళ్లారు. దానితో జాబ్రీ వీడియోను చిత్రీకరించి, అతని సోషల్ మీడియా ఖాతాలో (సుమారు 10 లక్షల మంది ఫాలోయర్లు ఉన్నారు) అప్‌లోడ్ చేశారు. ఈ వీడియోలో జాబ్రీ ముఖంలో కొంచెం కూడా బాధగానీ, పశ్చాత్తాపం గానీ కనిపించకపోగా.. హ్యాపీగా నవ్వుతూ ఎంజాయ్ చేస్తున్నట్టుగా కనిపిస్తుండటం గమనార్హం.ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో.. ఈ నెల 15న (సోమవారం) జైళ్ల శాఖ అధికారుల దృష్టికి వచ్చింది.

వెంటనే స్పందించిన అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలిసిన వెంటనే జాబ్రీ స్నేహితులు ఆ వీడియోను సోషల్ మీడియా నుంచి తొలగించారు. అయితే, పోలీసులు ములాఖత్ రిజిస్టర్‌లోని వివరాల ఆధారంగా నిందితులపై కేసు నమోదు చేసేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం. అంతేకాకుండా, ఆ సమయంలో ములాఖత్ హాలు వద్ద విధుల్లో ఉన్న ఇద్దరు సిబ్బందికి జైళ్ల శాఖ ఉన్నతాధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.
విశేషమేమిటంటే.. 24 ఏళ్ల వయస్సు ఉన్న జాబ్రీ చూడటానికి 17 ఏళ్ల యువకుడిలా కనిపిస్తాడు. అతనిపై గతంలోనూ బెదిరింపులు, ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు సంబంధించిన పలు కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ తాజా ఘటన చంచల్‌గూడ జైలు భద్రతా వ్యవస్థపై విమర్శలకు తావిస్తోంది. ఉన్నత స్థాయి అధికారులు ఈ విషయంపై ఎలా స్పందిస్తారో వేచి చూడాలి.

## పేదలకు అండగా బాబుమోహన్ చారిటబుల్ ట్రస్ట్

**హైదరాబాద్  పెన్ పవర్:** ప్రముఖ సినీ నటుడు, మాజీ మంత్రి బాబు మోహన్ తన కుమారుడి జ్ఞాపకార్థం 'పవన్ బాబుమోహన్ ఛారిటబుల్ ట్రస్ట్'ను స్థాపించారు. ఈ ట్రస్ట్ ద్వారా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న నిరుపేదలకు చేయూత అందించనున్నారు. సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో జరిగిన ఆవిర్భావ సమావేశంలో బాబు మోహన్ ట్రస్ట్ లక్ష్యాలు, కార్యక్రమాలను వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి అనుమతి పొందిన ఈ ట్రస్ట్.. నిరుపేదలకు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను కల్పించడంపై ప్రధానంగా దృష్టి సారిస్తుందని ఆయన తెలిపారు. నిరుద్యోగులకు చేయూత అందించడం కూడా ట్రస్ట్ ముఖ్య లక్ష్యాలలో ఒకటిగా పేర్కొన్నారుబాబు మోహన్ మాట్లాడుతూ.. తన కుమారుడి పేరుతో ఏర్పాటు చేసిన ఈ ట్రస్ట్ ద్వారా సమాజంలోని బలహీన వర్గాలకు సహాయం అందించాలనేది తన చిరకాల కోరిక అని అన్నారు. పేదరికం నుంచి బయటపడటానికి విద్య ఒక ముఖ్యమైన సాధనమని ఆయన నొక్కి చెప్పారు. అందుకే.. ట్రస్ట్ ద్వారా నిరుపేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు.. వారికి నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకురావడానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు.అలాగే.. సరైన వైద్యం అందక ఇబ్బందులు పడుతున్న వారికి సహాయం అందించడం కోసం.. వైద్య శిబిరాలు నిర్వహించడం, ఆసుపత్రి ఖర్చుల కోసం ఆర్థిక సహాయం చేయడం వంటి కార్యక్రమాలను ఈ ట్రస్ట్ చేపడుతుందని బాబు మోహన్ తెలిపారు. ఉపాధి లేని యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించి.. వారు ఉద్యోగాలు పొందేలా సహాయం చేస్తుందన్నారు.ట్రస్ట్ ద్వారా సహాయం పొందాలనుకునే వారు కోఆర్డినేటర్ రాజ్ కుమార్‌ను 8919511215 నెంబర్ ద్వారా సంప్రదించవచ్చని బాబు మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం బండారు గూడెం కోయజాతికి చెందిన సమీప అనే విద్యార్థి ఎంటెక్ చేయడానికి, గ్రూప్స్ కోచింగ్ తీసుకోవడానికి బాబు మోహన్ తన ట్రస్ట్ ద్వారా ఆర్థిక సహాయం అందజేశారు.బాబు మోహన్ కుమారుడు పవన్ కుమార్ 2003 అక్టోబర్ 12న జరిగిన హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. స్పోర్ట్స్ బైక్ అదుపుతప్పి డివైడర్‌ని ఢీ కొట్టడంతో ఆయన ప్రాణాలు కోల్పోయారు. కొడుకు మరణంతో బాబు మోహన్ ఎంతగానో కుంగిపోయారు. కొడుకు పేరిట సేవా కార్యక్రమాలు చేపట్టాలని తాను ఎంతో కాలంగా భావిస్తున్నానని.. కానీ రాజకీయాల్లో బిజీగా ఉండటం వల్ల కుదరలేదన్నారు. తాను ఇప్పుడు రాజకీయాలకు దూరంగా ఉండటం వల్ల పూర్తి స్థాయిలో ట్రస్ట్ కోసం పని చేస్తానని ఆయన చెప్పారు. అయితే గత ఏడాది అక్టోబర్లో బాబు మోహన్ టీడీపీ సభ్యత్వం తీసుకోవడం గమనార్హం. ఒక గిరిజన విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించడానికి సహాయం చేయడం ట్రస్ట్ లక్ష్యానికి నిదర్శనమని బాబు మోహన్ తెలిపారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి.. ఎక్కువ మంది నిరుపేదలకు సహాయం అందించడానికి తమ ట్రస్ట్ కృషి చేస్తుందని ఆయన తెలిపారు.

## నిలిచిపోయిన రేవంత్ లిఫ్ట్...

**హైదరాబాద్  పెన్ పవర్:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి తృటిలో ప్రమాదం తప్పింది. హైదరాబాద్‌లోని నోవాటెల్ హొటల్?లో లిఫ్ట్‌లో స్వల్ప అంతరాయం కలిగింది. సీఎం ఎక్కిన లిఫ్ట్‌లో అంతరాయం కారణంగా ఒక్కసారిగా నిలిచిపోయింది. 8 మంది ఎక్కాల్సిన లిఫ్ట్‌లో 13 మంది ఎక్కడంతో లిఫ్ట్ మొరాయించింది. సీఎం రేవంత్ ఎక్కిన లిఫ్ట్ ఓవర్ వెయిట్‌తో ఉండాల్సిన ఎత్తు కన్నా లోపలికి చొచ్చుకుపోయింది.ఘటనా స్థలిలో ఉన్న అధికారులు, సీఎం సహా ఆయన సిబ్బంది టెన్షన్ పడ్డారు. అసలు జరుగుతుందో తెలియక అయోమయానికి గురయ్యారు. కాసేపటికి తేరుకుని లిఫ్ట్ నుంచి అందరూ బయటకు వచ్చేశారు.హొటల్ సిబ్బంది, సీఎం సెక్యూరిటీ అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. లిఫ్ట్ ఓపెన్ చేసి వేరే లిఫ్ట్‌లో సీఎంను సెకండ్ ఫ్లోర్‌కి తరలించారు. సీఎం రేవంత్‌కు ప్రమాదం తప్పడంతో అధికారులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.నోవాటెల్ హొటల్‌లో సీఎల్పీ సమావేశం సందర్భంగా సీఎం రేవంత్ అక్కడికి చేరుకున్నారు. తెలంగాణ ప్రభుత్వ విప్‌లు, ఎమ్మెల్యేలు సీఎంకు ఆహ్వానం పలికి నోవాటెల్ లోపలికి తీసుకెళ్లారు. లిఫ్ట్ అధిక బరువు కారణంగా వెంటనే కిందికి కుంగిపోయింది. అలారం మోగిన వెంటనే అధికారులు, హొటల్ సిబ్బంది హుటాహుటిన లిఫ్ట్ వద్దకు చేరుకున్నారు.

## వడదెబ్బతో ప్రాణం కోల్పోతే 4 లక్షల సాయం

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. వేసవి కాలంలో ఎండ వేడి, వడగాలుల వల్ల చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు ఆర్థిక సహాయాన్ని భారీగా పెంచింది. ఎండలు, వడగాలులు, వడదెబ్బ ప్రభావంతో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ. 4 లక్షల చొప్పున ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం మంగళవారం (ఏప్రిల్ 15న) ఉత్తర్వులు జారీ చేసింది.గతంలో వడదెబ్బకు గురై, ఎండల తీవ్రతతో అస్వస్థతకు లోనై ఎవరైనా మరణిస్తే రూ. 50 వేలు చెల్లించేవారు. తాజాగా రాష్ట్ర విపత్తు సహాయ నిధి కింద తెలంగాణ ప్రభుత్వం ప్రస్తుతం ఆ ఎక్స్ గ్రేషియాను 50 వేల రూపాయల నుంచి 4 లక్షల రూపాయలకు పెంచింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం (జీవో ఎంఎస్ నంబర్ 5, తేదీ 15-04-2025) ఉత్తర్వులు జారీ చేసింది.2024 ఏడాది ఇప్పటివరకూ అత్యంత వేడి సంవత్సరంగా నిలిచింది. ప్రజలు వడగాలులు, ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్థానిక అధికారులు, వాతావరణ నిపుణులు జారీ చేసిన ఆరోగ్య సలహాలను పాటించాలని ప్రభుత్వం సూచించింది. వేసవి కాలంలో వీచే వడగాలులు వాటి ప్రభావాలపై ప్రజలకు అవగాహన పెంచడానికి సంబంధిత శాఖల ద్వారా కార్యక్రమాలు చేపడుతున్నారు.ఈ ఏడాది సాధారణం కంటే అధిక వర్షాలు పడతాయని భారత వాతావరణ శాఖ తెలిపింది. సాధారణ వర్షాపాతం అంటే 100 శాతంలోపు వర్షాలు పడతాయని, ఈ సారి 96-104 శాతం వర్షాపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ ఏడాది 105 శాతం కంటే అధికంగా వర్షపాతం నమోదు అవుతుందని అంచనా వేశారు. మరోవైపు ఈ ఏడాది గతేడాదితో పోల్చితే వేసవిలోనూ అకాల వర్షాలు కురుస్తున్నాయి. ఫిబ్రవరి మొదటివారంలో ఎండలు చూసి ప్రజలు హడలెత్తిపోయారు. ఆపై మార్చిలో కొంచె ఎండలతో ప్రజలు పలు రాష్ట్రాలలో ఇబ్బంది పడ్డారు. కానీ గత ఏడాదితో పోల్చితే రెండు, మూడు డిగ్రీలు తక్కువగా గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కావడం ఊరటనిచ్చే విషయం. ఏప్రిల్ నెలలో ఏపీ, తెలంగాణలో కొన్ని చోట్ల వడగండ్ల వానలు పడ్డాయి. గత వారం నుంచి అక్కడక్కడా మోస్తరు వర్షాలు కురవడంతో ఎండల నుంచి ఊరట కలుగుతోంది. వేసవి ఇంకా ముగియలేదని, ప్రజలు ఇంకా అప్రమత్తంగా ఉండాలని.. వైద్య నిపుణులు సూచించే జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

## కాసేపు చల్లబడిన వాతావరణం

**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ లో వాతావరణం ఒక్కసారిగా మారిపో యింది. ఉదయం నుంచి ఎండ దంచికొట్టగా.. మధ్యాహ్నానికి ఆకా శం చల్లబడింది. నిమిషాల్లోనే వాతావరణం మేఘావృతమైంది. ఈ క్రమంలో పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, యూసఫ్ గూడా, అమీర్పేట్, ఖైరతాబాద్, పంజాగుట్ట, సోమాజిగూడ, ఎస్ఆర్ నగర్, ఎర్రమంజిల్, తదితర ప్రాంతాల్లో ఈదురు గాలులతో కూడిన వాన పడింది.

## స్లాట్ బుకింగ్ నిలిపివేయాలి

**హైదరాబాద్ పెన్ పవర్:** భూమి, ఫ్లాట్స్ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెడుతున్న స్లాట్ బుక్కింగ్ విధానాన్ని తక్షణమే నిలిపివేయాలని కోరుతూ మల్కాజిగిరి సబ్ రిజిస్ట్రర్ కి మల్కాజిగిరి డాక్యుమెంట్ రైటర్ వెల్ఫేర్ అసోసియేషన్ వినతి పత్రం అందజేయడం జరిగింది.

నూతన స్లాట్ బుకింగ్ విధానం కారణంగా డాక్యుమెంట్ రైటర్ల ఉపాధి రోడ్లపై పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేసారు.

# కులగణన మోడీకి మరణశాసనం



**హైదరాబాద్ పెన్ పవర్:**
ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని కొన్ని సమస్యలకు మన ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపిందన్నారు. శంషాబాద్ నోవాటెల్ లో జరిగిన సీఎల్పీ మీటింగ్ లో రేవంత్ మాట్లాడారు. సన్నబియ్యం పథకం ఒక అద్భుతమని.. ఆనాడు రూ.2 కిలో బియ్యంలా ఇప్పుడు సన్నబియ్యం పథకం శాశ్వతంగా గుర్తుండే పథకమన్నారు. భూ భారతిని రైతులకు చేరవేయాలని .. దేశంలోనే ఇందిరమ్మ ఇండ్లు పథకం ఆదర్శంగా నిలిచిందని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో నిజమైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు అందాలని స్పష్టం చేశారు. కులగణన ద్వారా వందేళ్ల సమస్యను శాశ్వతంగా పకడ్బందీగా పరిష్కరించామని.. విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని బిల్లులు తీసుకొచ్చామని.. ఇది మన పారదర్శక పాలనకు నిదర్శనమని గుర్తు చేశారు. జఠిలమైన ఎస్సీ ఉపకులాల వర్గీకరణ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామన్నారు. అందుకే వర్గీకరణ జరిగే వరకు ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేదని.. మనం తీసుకున్న గొప్ప నిర్ణయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రేపటి నుంచి జూన్ 2 వరకు ఎమ్మెల్యేలు నియోజకవర్గంలో ప్రతీ గ్రామం పర్యటించేలా కార్యాచరణ తీసుకోవాలని సూచించారు. నేను కూడా మే 1 నుంచి జూన్ 2 వరకు ప్రజలతో మమేకం అవడానికే సమయం కేటాయిస్తానని ప్రకటించారు. హెచ్ సీ యూ భూములపై ప్రతిపక్షం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తో ఒక అబద్ధపు ప్రచారం చేసిందని.. ఈ ప్రచారాన్ని ప్రధాని మోదీ కూడా నమ్మి బుల్డోజర్లు పంపిస్తున్నారని మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బీజేపీ, బీఆరెస్ కలిసి ప్రజా ప్రభుత్వంపై విష ప్రచారం చేస్తున్నాయన్నారు. పార్టీ, ప్రభుత్వం ప్రతిష్ఠ పెరిగితేనే భవిష్యత్ ఉంటుంది.. మనం ఎంత మంచి చేసినా.. ప్రజల్లోకి తీసుకెళ్లకపోతే ప్రయోజనం ఉండదని స్పష్టం చేశారు. మళ్లీ గెలవాలంటే ఇప్పటి నుంచే ప్రజల్లోకి వెళ్లాలి.. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిందేనన్నారు. మీ నియోజకవర్గంలో ఏం కావాలో ఒక నివేదిక తయారు చేసుకోండి ..ఆ పనులను పూర్తి చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. నిన్న మొన్నటి వరకు బండి సంజయ్, కిషన్ రెడ్డి మనపై విమర్శలు చేశారు.. ఇప్పుడు ఏకంగా ప్రధాని మోదీనే రంగంలోకి దిగారు. తెలంగాణ పథకాలతో ప్రధాని మోదీ ఉక్కిరి,బిక్కిరి అవుతున్నాడు.. వర్గీకరణ మోదీకి గుదిబండగా మారింది ..కులగణన మోదీకి మరణశాసనం రాయబోతోందన్నారు. దేశంలో తెలంగాణ మోడల్ పై చర్చ జరుగుతోంది. అందుకే తెలంగాణలో కాంగ్రెస్ ను ఇబ్బంది పెట్టాలనే బీజేపీ, బీఆరెస్ ఒక్కటయ్యాయని ఆరోపించారు. సన్న బియ్యం బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎందుకు ఇవ్వడం లేదో చెప్పాలన్నారు. సన్న బియ్యం మన పథకం..,మన పేటెంట్,మన బ్రాండని స్పష్టం చేశారు. మంత్రి పదవులు ఆశిస్తున్న వారు ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడటం వల్ల వారికే సమస్యలు వస్తాయని రేవంత్ గుర్తు చేశారు. ఎంపీ చామలపై రేవంత్ మండిపడ్డారు. ఆయన పలువురు పేర్లు పరిశీలనలోకి తెస్తున్నారన్నారు. హైకమాండ్ ఇప్పటికే నిర్ణయం తీసుకుందని .. ఇష్టం వచ్చినట్లుగా ప్రకటనలు వద్దని పార్టీ నేతలకు హెచ్చరికలు పంపారు.

# గ్లోబల్ బిజినెస్ హబ్" గా హైదరాబాద్ "



**హైదరాబాద్ పెన్ పవర్:**
2030 నాటికి హైదరాబాద్ లో 200 మిలియన్ చదరపు అడుగుల "గ్రేడ్ ఏ" కమర్షియల్ స్పేస్ ను అందుబాటులోకి తేవడం తమ లక్ష్యమని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. నానక్ రాంగూడలో మంగళవారం యూఎస్ కు చెందిన సిటిజెన్స్ ఫైనాన్షియల్ గ్రూప్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ ఏర్పాటు చేసిన "సిటిజెన్స్ గ్లోబల్ కేపబిలిటీ సెంటర్" ను శ్రీధర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు. .. హైదరాబాద్ "గ్లోబల్ బిజినెస్ హబ్" గా మారింది. అందుకు అనుగుణంగానే నగరంలో కమర్షియల్ స్పేస్ కు డిమాండ్ పెరిగింది. ఢిల్లీ, చెన్నై లాంటి మెట్రో నగరాల్లో కమర్షియల్ స్పేస్ కు డిమాండ్ తగ్గుతుంటే గతేడాది మన దగ్గర దేశంలోనే అత్యధికంగా 56 శాతం వార్షిక వృద్ధి రేటు నమోదయ్యింది. గతేడాది రిటైల్ రంగంలో 1.8 మిలియన్ చదరపు అడుగుల స్పేస్ ను వివిధ సంస్థలు లీజుకు తీసుకున్నాయి. హైదరాబాద్ లో ఆమ్జెన్, ఎలీ లిల్లీ, మారియంట్, గ్లోబల్ లాజిక్, సిగ్నా లాంటి అంతర్జాతీయ సంస్థలకు చెందిన 355 జీసీసీలుండగా... 3 లక్షల మందికి ఉద్యోగాలు రానున్నాయి. ఏడాది వ్యవధిలో 70 కి పైగా కొత్త జీసీసీలు హైదరాబాద్ లో ప్రారంభమయ్యాయి. హైదరాబాద్ ను జీసీసీలకు హబ్ గా మార్చడంతో పాటు వాటిని ఇన్నోవేషన్, ఆర్అండ్ డీ, ప్రొడక్ట్ డెవలప్మెంట్ తదితర అంశాల్లో సేవలు అందించే గ్లోబల్ వాల్యూ యాడెడ్ సెంటర్లుగా తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు శ్రీధర్ బాబు తెలిపారు. 2030 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటా ట్రిలియన్ డాలర్లకు చేరుతుందన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొచ్చి.. యువతకు ఉద్యోగాలు కల్పించడమే తమ లక్ష్యమని వివరించారు. కొందరు కావాలనే పనిగట్టుకొని పెట్టుబడులు రాకుండా దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. అయినా... సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంపై నమ్మకంతో ఎంతో మంది పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు స్థాపించేందుకు ముందుకు వస్తున్నారని... అన్ని రకాలుగా వారికి అండగా ఉంటామన్నారు. తమ జీసీసీని హైదరాబాద్ లో ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చిన సిటిజెన్స్ ఫైనాన్షియల్ గ్రూప్, కాగ్నిజెంట్ టెక్నాలజీస్ నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.
ప్రస్తుతం 100 మంది ఐటీ, డేటా నిపుణులకు ఇక్కడ ఉపాధి అవకాశాలు లభిస్తాయని... రెండు, మూడేళ్లలో ఈ సంఖ్య రెట్టింపు అవుతుందన్నారు. కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, సిటిజన్స్ ఫైనాన్షియల్ గ్రూప్ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్, హెడ్ ఆఫ్ ఎంటర్ప్రైజ్ టెక్నాలజీ, సెక్యూరిటీ మైకెల్, కాగ్నిజెంట్ ప్రెసిడెంట్ – అమెరికా సూర్య గుమ్మాడి తదితరులు పాల్గొన్నారు.